
www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
5
తిరుపతి



పలు రైళ్లు దారి మళ్లింపు



ప్రజాశక్తి - గూడూరు టౌన్

చెన్నై - గుమ్మడిపూడి వద్ద రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 16, 19, 21 తేదీలలో పలు రైళ్లు దారి మళ్లించామని, వివరాల కొరకు రైల్వే స్టేషన్లో సంప్రదించాలని గూడూరు రైల్వే స్టేషన్ సూపర్నిటెండెంట్ వెంకటేశ్వరరావు కోరారు. గూడూరు రైల్వేస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ విజయవాడ నుండి చెన్నై వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ గూడూరు వరకు మాత్రమే వస్తుందని, తిరిగి సాయంత్రం గూడూరు నుండి విజయవాడకు బయలుదేరుతుందని తెలిపారు. అదేవిధంగా ఈ మూడు రోజులు చెన్నై నుండి వచ్చే నవజీవన్ ఎక్స్ప్రెస్ వయా రేణిగుంట మీదుగా గూడూరుకు వస్తుందని వెల్లడించారు. ఇంకా పలు రైళ్లు దారి మళ్లించడం జరిగిందని తెలిపారు .



'మినిమం టైమ్‌స్కేల్' జీవోల్లో..!
నిత్యావసర భారాలు జీవితాల్లో..!

అధికారం మారిన ప్రతిసారీ పాలకుల హైడ్రామా
జిల్లాలో 25వేల మంది ఆవేదన
నేడు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సదస్సు

జీవో 2 వల్ల మరింత నష్టం : గండికోట నాగవెంకటేష్, చైర్మన్, తిరుపతి జిల్లా జెఎసి



టిడిపి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 2 వల్ల , గత జీవోలు కన్నా మరింత నష్టం వాటిల్లుతుంది. ఉద్యోగ భద్రత కరువు అవుతుంది, కాంట్రాక్ట్ అవుట్సోర్ ఉద్యోగులకు వేతనాలు పెరగడం కలగానే మిగిలిపోతుంది. ఈ జీవోలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

పాలకులను నిలదీద్దాం : చినబాబు, రాష్ట్ర అధ్యక్షులు ఆప్కాస్ యూనియన్



పర్మినెంట్ ఉద్యోగులకు ఇస్తున్న మినిమం బేసిక్ పే, మిగిలిన అలవెన్స్ సౌకర్యాలు కల్పించాలని సుప్రీంకోర్టు నిర్దిష్టమైన తీర్పు ఇచ్చినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలు చేయకపోగా కార్మికుల శ్రమను దోచేస్తున్నాయి. మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్ హెల్త్ అసిస్టెంట్ లో రిక్రూట్మెంట్ లో సక్రమమైన పద్ధతి పాటించలేదని హైకోర్టు తీర్పు ఇవ్వగానే రాష్ట్రంలో 1500 మందిని తొలగించారని, అదే కోర్టులు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పులు ఇప్పటివరకు అమలు చేయకపోవడం శోచనీయం. పాలకులను ఐక్యంగా నిలదీద్దాం.

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కనీస వేతనాల కోసం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఏళ్లతరబడి పోరాడుతున్నా అది కలగానే మిగిలింది.. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా పట్టించుకున్న నాథుడు లేరు. అయితే పాలకులు భారాలు మోపడం మాత్రం ఆపలేదు.. జీవోలు మారుతున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. ముఖ్యమంత్రులు మారుతున్నారు.. అయితే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల జీవితాల్లో ఎటువంటి మార్పు లేదు. తిరుపతి జిల్లావ్యాప్తంగా వివిధ రంగాల్లో వివిధ పేర్లతో దాదాపు 25వేల మందికి పైగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ కార్మికులు కనీస వేతనం అందక కడగండ్లతోనే కాపురాలు చేస్తున్నారు.

రాష్ట్రప్రభుత్వంలో కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, యూనివర్శిటీలు, విద్య, వైద్యరంగం, విద్యుత్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ, పార్ట్‌టైమ్, డైలీవేజ్, గెస్ట్ కంటింజెంట్, ఎన్ఎంఆర్ వంటి రకరకాల పేర్లతో ఉద్యోగులుగా వివిధ శాఖలలో కార్మికులు పని చేస్తున్నారు. ఒక తిరుపతి జిల్లాలోనే సుమారు 25వేల మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. 2015 నుంచి వీరికి జీతాలు పెరగపోగా శ్రమదోపిడికి గురవుతున్నారు.

రాష్ట్రంలో కార్మికుల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. 8వ పిఆర్సి లో జీవో నెంబర్ 2501, 9వ పిఆర్సి లో జీవో నెంబర్ మూడు విడుదల చేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఒకే జీవో ఇచ్చి, జీతాల పెంపుదలను ఆనాటి ప్రభుత్వాలు అమలు చేశాయి. 2015 లో ఇచ్చిన పదో పిఆర్సిలో గతంలో మినిమం బేసిక్ పే కు విరుద్ధంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను ముక్కలు చేసి జీవో నెంబర్ 151 విడుదల చేశారు. దీంతో కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఇతరత్రా ప్రాజెక్టుల్లో పని చేసే కార్మికులను విభజించడంతో ఎవరికి వారే వేర్వేరుగా పోరాటాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019లోనూ, 2021, 2022 లోనూ జీవోలను విడుదల చేసినా చంద్రబాబునాయుడు, జగన్మోహన్‌రెడ్డిలు అమలు చేయలేదు. తాజాగా 2024లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2025, జనవరిలో కొత్తగా జీవో నెంబర్ 2ను విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం ప్రభుత్వ శాఖలో ఆర్థిక శాఖ అనుమతి పొందిన ఖాళీలో మాత్రమే, రిటైర్మెంట్ అయిన ఉద్యోగుల స్థానంలో భర్తీ అయిన కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే ఈ మినిమం టైమ్స్ స్కేల్ అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో సుమారు 90 శాతం మంది కార్మికులు ఆర్థిక శాఖ అనుమతులు లేకుండానే ప్రభుత్వం ద్వారానే అవసరాల రీత్యా భర్తీ అయ్యారు. వీరందరికీ ఈ జీవో వర్తించకపోవడం బాధాకరం. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు అసలు ఇది వర్తించదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక నిర్ణయాలకు నిరసనగా ఐక్య ఉద్యమాలు చేసేందుకు కార్మిక సంఘాలు నడుం బిగించాయి. అందులో భాగంగానే ఈ నెల 16వ తేదీ తిరుపతి కేంద్రంగా మినిమం టైమ్ స్కేల్ సాధనకై జిల్లా సదస్సు నిర్వహించేందుకు సిఐటియు అనుబంధ సంఘాలు నిర్ణయించాయి. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఈ సదస్సుకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చాయి.

కేంద్ర బడ్జెట్‌లో...కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్..!

ప్రజాశక్తి - తిరుపతి సిటి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరిచేలా ఉంది తప్ప, సామాన్యులకు ఏమాత్రం ఉపయోగపడేలా లేదని వామపక్షాలు ఉద్ఘాటించాయి. పేదరిక నిర్మూలన లక్ష్యంగా బడ్జెట్ లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు , సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ యం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్ హరికష్ణ , ఆర్పిఐ అధ్యక్షులు పి అంజయ్య తీవ్రంగా విమర్శించారు. వామపక్ష పార్టీల జాతీయ సమితి పిలుపు మేరకు తిరుపతి బైరాగి పట్టెడ లోని సిపిఐ కార్యాలయంలో వామ పక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి వేణు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఏమాత్రం సబ్సిడీ లేకుండా, ఎవరికి అన్యాయం చేశారని నక్సలైట్ల పేరుతో గిరిజనులను చంపుతూ ఖనిజ సంపదంత కార్పొరేటర్లకు అప్పగించాలనే కుట్రలో భాగంగానే మీ హత్యాకాండను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మోడీ హయాంలో మొదటినుండి బడ్జెట్ అన్యాయం చేస్తూనే ఉన్నా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గానీ, ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాట కూడా మాట్లాడకపోవడం అత్యంత దారుణం అన్నారు. ప్రజల్ని ఐక్యంగా ఉంచాల్సిన కాంగ్రెస్ పార్టీ బాధ్యత లేకుండా ఉండడం వల్లే అన్ని రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాలు స్పష్టమవుతున్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యా, వైద్యం, తో పాటు వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. దేశం లో యువత ఉద్యోగాలు లేకుండా నిరుద్యోగులుగా ఉన్నా, వీరి సంక్షేమం కోసం బడ్జెట్ కేటాయించక పోవడం దారుణం అన్నారు. టోల్ ప్లాజా పేరుతో ప్రజల నుండి పెద్ద మొత్తంలో ముక్కు పిండి వసూలు చేసి కార్పొరేటర్లకు అనుకూలంగా మార్చుతున్నారు అని విమర్శించారు. ఉపాధి హామీని నీరుగారుస్తున్నారని అన్నారు. ఆర్ హరికష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 50 లక్షల కోట్ల బడ్జెట్లో కనీసం ఈ రాష్ట్రానికి 26 రూపాయలు కూడా కేటాయించలేదన్నారు ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లో బడ్జెట్ను అధికంగా కేటాయించి దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. పి అంజయ్య మాట్లాడుతూ ప్రభుత్వాలు పేదలకు ఇస్తున్న ఉచితాలపై సుప్రీంకోర్టు జడ్జిలు మాట్లాడడం భావ్యం కాదన్నారు. ఎస్సీ ఎస్టీ బడ్జెట్ రాజ్యాంగ ప్రకారం 22 శాతం దామాషా ప్రకారం కేటాయించాల్సి ఉన్నా ఆ దిశగా బడ్జెట్ కేటాయించకుండా ఎస్సీ ఎస్టీ పేదలకు అన్యాయం చేస్తుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ బడ్జెట్ అన్యాయంపై దశల వారీ జరగబోవు పోరాట కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో చిన్నం పెంచలయ్య, కె.రాధాకష్ణ , పి.వెంకటరత్నం, బుజ్జి పాల్గొన్నారు.



బడ్జెట్‌పై వామపక్షాల రౌండ్‌టేబుల్

'వడమాల' దళిత గ్రామానికి రోడ్డు ఎప్పటికో..!

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



'రహదారులపై గుంతలు ఉంటే ఊరుకునేది లేదు' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హుకుం జారీ చేస్తున్నారు. అయితే వడమాలపేట మండలం వడమాల మాదిగపల్లి దళిత గ్రామానికి వెళ్లాలంటే రోడ్డే లేదు. ఈ దళితవాడలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ గ్రామానికి వెళ్లాలంటే ఒకటి చుట్టు చుట్టుకుని వెళ్లాలి లేదా, బావులు కలిగిన దారిలోనే గర్భిణీలైనా, పండు ముసలివారైనా, స్కూలుకు వెళ్లే విద్యార్థులైనా వెళ్లాల్సి ఉంటుంది. ఈ మార్గంలో వర్షం పడిందంటే బురదలో జారిపడటం ఖాయం. దాదాపు నాలుగు గ్రామాలకు చెందిన వారు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉంటుంది. తమ గ్రామానికి తాము పుట్టినప్పటి నుంచి రోడ్డే లేదని గ్రామస్తులు ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షులు వావిళ్ల అజిత్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. 1993 నుంచి తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నానని, అయితే ఇంతవరకూ రోడ్డు వేసిన నాధుడు లేడన్నారు. ఆ ఊరికి దారి వేయాలంటే రైతుల భూములు అడ్డుగా ఉన్నాయని, వారిని ఒప్పించి వేస్తామని అధికారులు ప్రతిసారీ చెప్పి తప్పించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఈ ధర్నా కార్యక్రమంలో పర్రీ గోవిందరాజులు, రమేష్ ముని పాల్గొన్నారు.

సమిష్టిగా బాల్య వివాహాలకు అడ్డుకట్ట

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సమిష్టిగా పని చేసి అతి పెద్ద జాడ్యంగా మారుతున్న బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేద్దామని ప్రగతి సంస్థ జిల్లా ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ రాజా రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సరస్వతీ భాయి మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ పడాయిపై శిక్షణ ఇచ్చారు. యాక్సిస్టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ పై అవగాహన కల్పించారు. రాబోయే శివరాత్రికి శ్రీకాళహస్తిలో దేవుడి పెళ్లిని పురస్కరించుకుని చాలామంది బాల్య వివాహాలు చేసుకునే అవకాశం ఉందనీ, సమిష్టిగా వాటిని అడ్డుకునేందుకు సమన్వయంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మంజుల, కమ్యూనిటీ సోషల్ వర్కర్ మధు కుమార్, మల్లికార్జున, లతా పాల్గొన్నారు.

వైభవంగా వరల్డ్ అచీవర్స్ కాన్వకేషన్

ప్రజాశక్తి - క్యాంపస్



తిరుపతి కౌటిల్య ఇన్‌స్టిట్యూషన్‌లో 2025 వరల్డ్ అచీవర్స్ కాన్వకేషన్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫెన్సింగ్ గేమ్ జాతీయస్థాయి పోటీల్లో ఏడోసారి ప్రతిభ కనబరచి స్పోర్ట్‌కోటాలో ఎంబిబిఎస్ సీటు సాధించి అపోలో మెడికల్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతున్న కలకట నితిన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి తుడా సెక్రటరీ డాక్టర్ జి.వెంకట నారాయణ హాజరయ్యారు. యువత ప్రపంచ విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథిగా బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ మేనేజర్ పాల్గొన్నారు. అకాడమీ తరపున 10 మందికి వరల్డ్ అచీవర్స్ కాన్వకేషన్ అందించారు. రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శ్రీరాములు, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు పైడి అంకయ్య, బాషా పాల్గొన్నారు.

స్వచ్ఛత నాగరికతకు ప్రతిబింబం

ప్రజాశక్తి -తిరుమల

టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

రాబోయే కాలంలో వ్యర్థాల నిర్వహణలో టీటీడీ దేశంలోనే ఇతర దేవాలయాలకు ఆదర్శంగా నిలుస్తుందని టీటీడీ అదనపు ఈవో సి హెచ్ వెంకయ్య చౌదరి తెలియజేశారు. తిరుమలలోని లడ్డూ కౌంటర్ వద్ద శనివారం టీటీడీ అధికారులతో కలిసి ఆయన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత అనేది నాగరికతకు, సంస్కృతికి ప్రతిబింబమని, ఎక్కడైతే స్వచ్ఛత బాగుంటుందో అక్కడ పరిపాలన, క్రమశిక్షణ బాగున్నట్లు అనే నానుడి ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ తిరుమల కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుమలలో స్వచ్ఛత కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తిరుమలలో 24 గంటల పాటు 1200 మంది సిబ్బంది నిరంతరంగా పరిశుభ్రత కోసం కషి చేస్తున్నట్లు చెప్పారు. టీటీడీ ఆరోగ్య విభాగం ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తోందన్నారు. తిరుమలలో గత ఏడు నెలలుగా వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. తిరుమల డంపింగ్ యార్డులో పేరుకుపోయిన 2 లక్షల టన్నుల చెత్తను ఎరువుగా మార్చినట్లు తెలిపారు. మరో 40వేల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను రాబోయే రెండు నెలల్లో పూర్తిస్థాయిలో తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, ఈఈ-1 సుబ్రమణ్యం, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, యూనిట్ ఆఫీసర్ త్యాగరాజు పాల్గొన్నారు.



టిటిడి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ

తిరుపతి టౌన్‌బ్యాంక్ పైనా...
'కూటమి' కన్ను..!

వైసిపి మాట వింటే ఓకే..
లేదంటే ఆస్తులపై దండయాత్ర
చైర్మన్, వైస్‌చైర్మన్ చెరొకటి..
ఇదే 'ఆరణి'మంత్రం

తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఉప ఎన్నికతో 'కూటమి'కి కాన్ఫిడెన్స్ వచ్చేసినట్లుంది.. ఇక తగ్గేదేలే అంటూ మేయర్‌పై అవిశ్వాసానికి, తిరుపతి టౌన్‌బ్యాంక్‌ను కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది.. వైసిపి వారు మాట వింటే సరే.. లేదంటే ఆస్తులపై దండయాత్రే 'ఆరణి' మంత్రంగా ముందుకెళ్లనున్నారు.



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకులో జెండా ఎగురవేయడానికి కూటమి ప్రయత్నాలు ప్రారంభించింది. టౌన్‌బ్యాంక్‌లో వైసిపి చైర్మన్‌తో పాటు, వైస్‌చైర్మన్ కైవసం చేసుకోవాలంటే ఏడుగురు డైరెక్టర్ల మద్దతు ఉండాలి. ఏడుగురు డైరెక్టర్లను తమవైపు తిప్పుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. 2022లో తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ఎన్నికలను నిర్వహించారు. అప్పట్లో వైసిపి అధికారంలో ఉండడంతో టిడిపి, జనసేన పార్టీకి చెందిన అభ్యర్థులు నామినేషన్ వేసినా, వారిని గెలవనీకుండా ఏకపక్షంగా వైసిపి నేతలు తమకు కావాల్సిన వారిని అప్పట్లో గెలిపించుకున్నారు. అప్పట్లో ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో జరగలేదని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. చైర్మన్‌గా జయచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్‌గా వాసుదేవన్, డైరెక్టర్లుగా ఎం. నాదమునిరెడ్డి, ఎ.సురేష్ కుమార్ రెడ్డి, పి.నాగిరెడ్డి, జి.వెంక టేస్ రాయల్, ఎన్. అనిల్ కుమార్, ఆర్.బ్రహ్మ నంద రెడ్డి, కె.అమరనాథ్ రెడ్డి, ఖాసీం మహ్మద్, ఎం.చంద్రయ్య, వి.జ్యోతిప్రకాష్ ఉన్నారు. మొత్తం 12 మంది సభ్యుల్లో ఏడు గురు ఎటువైపుంటే వారిదే టౌన్ బ్యాంకు చైర్మన్ కుర్చీ వశమవుతుంది. ఇప్పటికే ఐదు గురు డైరెక్టర్లు కూటమిలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని కూటమి నేతలు అంటున్నారు. మరో ఇద్దరితో మంత నాలు జరుగుతున్నట్లు సమాచారం. కూటమి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే వైసిపి పాలకవర్గాన్ని కూల్చేందుకు సిద్ధంగా ఉన్నారు. గత కొన్ని రోజులుగా తిరుపతి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లో కూటమి నేతల జోక్యం పెరిగిపోయినట్లు సమాచారం. ప్రస్తుత పాలకవర్గం 2027, జూలైలో పూర్తవుతుంది. టౌన్‌బ్యాంక్‌లో ఉండే అధికారులు సైతం ప్రస్తుత పాలకమండలికి ఏ విధంగానూ సహకరించవద్దని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

వంద సంవత్సరాల చరిత్ర కలిగిన టౌన్ బ్యాంక్‌లో సుమారు 250 కోట్లు వరకు డిపాజిట్లు ఉన్నాయి .రేణిగుంట ,చంద్రగిరి, తిరుపతి రూరల్, తిరుపతి అర్బన్, శ్రీకాళహస్తి ,వడమాలపేట వరకు షేర్ హోల్డర్లు కలిగి ఉన్నారు.ప్రస్తుత పాలకవర్గంలో డైరెక్టర్లు కూటమికి మద్దతు ఇస్తే సరి. లేదంటే వారి ఆస్తులపై దాడులు చేసేందుకు కూటమి నేతలు ప్రణాళికను రచించారు. కార్పొరేషన్‌లో వారికి ఉన్న ఆస్తుల వివరాలు, టౌన్‌బ్యాంకులు వారు తీసుకున్న రుణాల వివరాలను సేకరించారు. పాతక ఏసులు ఏమైనా ఉన్నాయా? అని ఆరా తీస్తున్నారు. 'కూటమి' బలవంతపు బుజ్జగింపులు భరించలేక కొంతమంది టిడిపి, జనసేనల్లోకి వెళ్లేందుకు చూస్తున్నారు. అయితే వైసిపి అధిష్టానం వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యింది. 12 మంది డైరెక్టర్లలో కనీసం ఏడుగురు డైరెక్టర్లు కూటమి వైపు వస్తే చైర్మన్‌తో పాటు, వైస్‌చైర్మన్ పదవులను టిడిపి, జనసేన పంచుకునే విధంగా ఒప్పందం జరిగినట్లు సమాచారం.

కూటమి చైర్మన్ రేస్‌లో 'పులిగోరు'

కూటమి పార్టీ తరపున మాజీ చైర్మన్ పులిగోరు మురళీకృష్ణారెడ్డి రేస్‌లో ఉన్నారు. 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా పులిగోరు మురళి కష్ణారెడ్డి రెండుసార్లు ఎన్నికల్లో గెలిచి పది సంవత్సరాలు పాటు ఉన్నారు. 2014లో టిడిపిలో చేరిపోవడంతో అప్పట్లో కూడా టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా వ్యవహరించారు. మళ్లీ టౌన్ బ్యాంక్ చైర్మన్ పదవి కోసం పులిగోరు మురళి కృష్ణారెడ్డితో పాటు పలువురు టిడిపి, జనసేన నేతలు పదవిని ఆశిస్తున్నారు

శ్రీసిటీలో వేడుకగా పుస్తకావిష్కరణ సభ

ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్ లో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం ప్రఖ్యాత రచయితలు, సాహిత్య విశ్లేషకులు, పుస్తక ప్రియులతో వేడుకగా సాగింది. ఇందులో ప్రముఖ పర్వతారోహకుడు, రచయిత, వక్త భూమన్ రచించిన శేషాచల కొండకోనల్లో పుస్తకాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆవిష్కరించగా, డా. కనుపూరు శ్రీనివాసులు రెడ్డి రచించిన సముద్రం, శ్రీగంధం అనే రెండు తెలుగు కథా సంపుటాలను డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సన్నారెడ్డి రాజగోపాలరెడ్డి విడుదల చేశారు.సాహిత్య విమర్శకులు డా.ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్ పేటశ్రీ పాల్గొన్నారు.

డిజిటల్ గుర్తింపు కార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో లబ్ధి చేకూరాలంటే డిజిటల్ గుర్తింపు కార్డు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు సూచించారు. శనివారం శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీలో రైతు విశిష్ట డిజిటల్ గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు పరిశీలించారు. రైతు విశిష్ట డిజిటల్ గుర్తింపు కార్డు నమోదుకు కావాల్సింది రైతు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరని తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ రెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, ఏవో సూర్యప్రకాష్ రెడ్డి, వీఏఏ పావని పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాసాగార్డెన్ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ పి.మాధవీలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మార్చి 6వ తేదీ లోగా ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన అనంతరం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారనీ, ఉత్తీర్ణతా శాతాన్ని బట్టి గురుకులాల కేటాయింపులు జరుగుతాయని తెలిపారు.

'పుస్తకం'పై ప్రతాపం...!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

నవ సమాజ నిర్మాణం, మనుషుల మధ్య అంతరాలు రూపుమాపడం వంటి మాటలు ఆచరించడం దేవుడెరుగు. కనీసం మనిషిని మనిషిగా చూసే పరిస్థితి కూడా చేయిదాటి పోతోంది. మతం పేరుతో విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. సమాజాన్ని చైతన్యం చేసే ఉద్యమకారులు, మేధావులు, కవులు, రచయితలు, సాహితీవేత్తలపై దాడి చేయడమే కాకుండా పట్టపగలు, నడివీధుల్లో హత్య చేస్తున్నారు. తాము చనిపోయినా తమ పుస్తకాలు సమాజంలో చైతన్యం తెస్తాయన్న వారి ఆశయాలు ఆవిరయ్యేలా ఉన్నాయి. వాస్తవాలకు ఆధారంగా నిలుస్తున్న పుస్తకాలపై తీవ్రమైన దాడులు జరుగుతుండడం శోచనీయం. అందుకు తాజా ఉదాహరణ తిరుపతిలో పుస్తకప్రదర్శపై దాడి ఘటన.

చరిత్రకు రుజువు పుస్తకం. జ్ఞానాన్ని పంచేందుకు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు మార్గం ఇదే. సమాజచైతన్యానికి ఇదో ఆయుధం. ఒంటరి మనిషికి నిజమైన స్నేహితుడు కూడా పుస్తకమే. అలాంటి పుస్తకానికి నేడు మతం అనే చెద పడుతోంది. ఉన్మాదం పెట్రేగి విద్వేషం విస్పృంఖంగా పాకుతోంది. ఇందుకు నిదర్శనమే తిరుపతిలో ఇటీవల పుస్తక ప్రదర్శన పై దాడి. గత 17 సంవత్సరాలుగా భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో సాహితీవేత్తల చొరవతో అనేక మంది పబ్లిషర్స్ సహకారంతో అరుదైన పుస్తకాలను సైతం అందుబాటులో ఉంచుతూ పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ప్రతి సారీ పుస్తక ప్రదర్శనకు మంచి ఆదరణ లభిస్తోంది. అయితే ఎపుడూ లేనిది ఈసారి కొంత మంది మతోన్మాద ఆకతాయిలను వెంట పెట్టుకుని ఈ నెల 8వ తేది తిరుపతి ఇస్కాన్ మందిరం ఎదురుగా ఉన్న టిటిడి మైదానంలో జరుగుతున్న పుస్తక ప్రదర్శన వద్దకు రాత్రి 8 గంటల ప్రాంతంలో వచ్చారు. రాగానే 'పెరియర్ పుస్తకాలు ప్రదర్శిస్తారా... తల్లి, చెల్లెల్ని పెళ్లిచేసుకోమన్న దుర్మార్గుడు వాడు' అంటూ అసత్య పదజాలంతో దూషిస్తూ, విశాలాంధ్ర బుక్‌స్టాల్‌పై దాడి చేసి పుస్తకాలను చించేశారు. వాటిని తగటబెట్టేందుకు పూనుకోవడంతో అక్కడే ఉన్న కొంత మంది అభ్యుదయ వాదులు వాకా ప్రసాద్, సాకం నాగరాజు, వందవాసి నాగరాజు (సిపిఎం జిల్లా కార్యదర్శి) వంటి వారు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అల్లరి మూకలు వారిపై కూడా దాడికి పాల్పడి తీవ్రంగా దూషించారు. వారి చేష్టలు కారణంగా పుస్తక ప్రదర్శనకు వచ్చిన మహిళలు, పిల్లలు, వృద్ధులు భయభ్రాంతులకు గురయ్యారు. సాక్షాత్తు జిల్లా పాలనాధికారైన కలెక్టర్ పుస్తక ప్రదర్శనను సందర్శించి, పుస్తక పఠనం ప్రతి ఒక్కరూ చేయాలని, మంచి నేస్తం పుస్తకమని, సందర్శకుల్లో చైతన్యం నింపి, తాను కొన్ని పుస్తకాలను కొనుగోలు చేసి వెళ్లిన గంట వ్యవధిలోనే ఇలాంటి దారుణం జరగడం గమనార్హం. ఈ దుర్మార్గమైన ఘటనపై రచయితలు, కవులు, సాహితీవేత్తలు, మేధావులు, పుస్తకప్రియులు ఉవ్వెత్తున లేశారు. నిర్వాహకులు వెనువెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. 10వ తేది జిల్లా ఎస్పిని కలిసారు. దీంతో కారకులైన 10 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 11వ తేది తిరుపతి నగరంలో జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి నాలుగుకాళ్ల మండపం వరకు వందలాది మంది పుస్తకాలు చేతబట్టి భారీ నిరసన ప్రదర్శన చేశారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. అలాంటివారిని కఠినంగా శిక్షించే వరకు పోరాటం ఆపబోమని వెల్లడించారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూడాల్సి ఉంది.

వజ్ర్ జ్యూవెలరీ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి సిటి తిరుపతిలో వజ్ర జ్యూవెలరీస్ అండ్ ఎగ్జిబిషన్ అండ్ సేల్స్‌ను మేయర్ డాక్టర్ శిరీష ఘనంగా ప్రారంభించారు. ఎంపిక చేసిన ఆభరణాలపై మేకింగ్ ఛార్జీలు, వేస్టేజిపై యాభైశాతం తగ్గింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఫార్చ్యూన్ కెన్సస్‌లో ప్రారంభించిన ఆభరణాల ఎగ్జిబిషన్‌లో ఎన్నో మోడల్స్ ఉన్నాయని బిజినెస్ హెడ్ మైథిలి, మేనేజర్ సురేష్ తెలిపారు.



ప్లాస్టిక్ వాడకం ఆపుదాం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- సూళ్లూరుపేటలో భారీ ర్యాలీ



గుడ్డ సంచులు పంచుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, పరిసర ప్రాంతాలలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, ప్రజలు సహకరించాలని కోరుతూ శనివారం పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ, రోటరీ క్లబ్‌ల అద్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే చేతులు మీదుగా వ్యాపారులకు, ప్రజలకు గుడ్డ సంచులను పంచి పెట్టారు. ఈ ర్యాలీలో ట్రైనిటాట్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్ కవర్లు వద్దు గుడ్డ సంచులు ముద్దు, ప్లాస్టిక్ వాడకాన్ని ఆపుదాం పర్యావరణాన్ని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లి కోగిలి జయరామిరెడ్డి సేవా సంస్థ చైర్మన్ కోగిలి సురేష్ రెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షులు తిరుమూరు సుధాకర్ రెడ్డి కలిసి రెవెన్యూ అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ ర్యాలీలో మునిసిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి ,కమిషనర్ కె.చిన్నయ్య, వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆకుతోట రమేష్, తాడిపత్రి ఆదినారాయణ రెడ్డి, అత్తిరాల కిరణ్ కుమార్ ,బెజవాడ విజయమ్మ, ఆరణి విజయభాస్కర్ రెడ్డి, వేనాటి దనుజయరెడ్డి, పచ్చవ మాధవ నాయుడు, రోటరీ క్లబ్ కార్యదర్శి రామకృష్ణ ఏజీ కిషోర్, సేవా సంస్థకు చెందిన ఉదయ్ కుమార్, కృష్ణ రెడ్డి, రాజేష్, మహేష్ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని రైతులు తమ వివరాలు రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకుని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని వ్యవసాయ శాఖ అధికారిణి స్రవంతి కోరారు. శనివారం మండలంలోని పుల్లమ నాయుడు కండ్రిగలో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు 28వ తేదీ లోపు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు కార్డు పొందిన రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు పంటల బీమా, పంట నష్ట పరిహారం, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, వ్యవసాయ పరికరాలపై రాయితీలు పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు కార్తీక్, ఢిల్లీ రాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుల మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు : తిరుపతి జిల్లా: పిచ్చాటూరు మండల, శేషంపేటలో 102 ఏళ్ల ఆదెమ్మ, వెంగళత్తూరులో 103 ఏళ్ల చిన్నమ్మ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ఉదయం రెండు గ్రామాలకు వెళ్లి వారి భౌతికకాయాలవద్ద నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎంసీ మాజీ చైర్మన్ డీ.ఇలంగోవన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పద్దు రాజు, వాసు రెడ్డి, చిన్న, ఏసు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజం కోసం కృషి చేద్దాం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కాలుష్య రహిత సమాజం కోసం విద్యార్థి దశ నుండే కృషి చేయాలనీ సీఎస్ఐఆర్ ఫ్రమ్ గవర్నమెంట్ ఆఫ్ఇండియా కె. వి. తులసి రామ్ పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు కాలుష్య రహిత సమాజం కోసం, భావితరాల కోసం ఎలాంటి ఆలోచనలు చెయ్యాలి, గ్రీన్ వేహికల్స్ ఆవశ్యకత, ఎలక్ట్రిక్ వేహికల్స్ వాడకం, ఎలక్ట్రిక్ సేఫ్టీ మెజర్స్ గురించి విద్యార్థులుకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు శిరీష, శ్రీహరి, రఫీ, మస్తాన్బీ, నజీరా, సుప్రియ, ఝాన్సీ, ధన శ్రీ, సమ్రిన్ , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో క్రీడాసక్తిని పెంపొందించాలి

ప్రజాశక్తి- ఏర్పేడు : యస్ఓయస్ కుటుంబ బలోపేత కార్యక్రమం ద్వారా పిల్లలలో క్రీడా ఆసక్తిని పెంపొందించడం, వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 10500 రూ.విలువైన క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. ఎస్ఓఎస్ఎఫ్ఎస్పి లొకేషన్ ఇంచార్జ్ వి.సత్యనారాయణ, మునిరత్నం, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌లు క్రీడా సామాగ్రి అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యా బోధన ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంఈఓ ప్రేమలత క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు అందరూ సమావేశాలకు తప్పక హాజరవ్వాలని అత్యవసర పరిస్థిలలోతప్ప ఎవ్వరు సెలవు పెట్టకూడదని సూచించారు. నూతన మేలువలతో బోధన జరిపి సీ, డీ గ్రేడ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సునీత, నిర్మల్ కుమార్, వ్యాసాశ్రమం హెచ్ఎంలు క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు శ్రీరాములు, సుబ్రమణ్యం, సీ.ఆర్.పి మునీశ్వర్ హైస్కూల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్జిలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మార్చి 8న జరగబోవు జాతీయ లోకాదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. శనివారం కోర్టు ఆవరణములో పోలీసులు, న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ రాజీ మార్గములో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనము ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో పుత్తూరు ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకృష్ణ, పుత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పురుషోత్తం, కార్వేటినగరం సిఐ హనుమంతప్ప, పుత్తూరు సిఐ సురేందర్ నాయుడు, రూరల్ సిఐ రవీంద్ర, న్యాయవాదులు, కోర్టు. సిబ్బందులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో భాగస్వాములుకండి

స్వచ్ఛ తిరుపతి సాకారం కావాలంటే ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతోనే సాకారం

: జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి – రేణిగుంట: జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో గ్రామ స్థాయి నుండి మండల, డివిజన్, మునిసిపల్ స్థాయి వరకూ ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అప్పుడే స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ తిరుపతి సాకారం అవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కరకంబాడి గ్రామ పంచాయతీ, తారక రామ నగర్‌లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల ఒక్కో రకమైనథీమ్‌తో, ఫిబ్రవరిలో సోర్స్–రిసోర్స్ థీమ్‌తో కార్యక్రమం చేపడుతున్నామని, గత నెల నుండి ఈ కార్యక్రమం నిర్వహించు కుంటున్నామని తెలాపారు. తడి చెత్త – పొడి చెత్తలను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. చెత్త నుండి సంపద సృష్టిపై, కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారీ, పొడి చెత్త సంబంధించి ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లును మెషీన్ నందు క్రష్ చేసి వచ్చే వ్యర్థాల పొడి రీసైక్లింగ్, వాటి వినియోగం రోడ్ల నిర్మాణాల్లో వాడతారని మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు వర్మీ కంపోస్ట్ ఎరువును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. అలాగే పారిశుధ్యంలో నిమగ్నమై పరిశుభ్ర వాతావరణాన్ని కల్పిస్తున్న పారిశుధ్య కార్మికులు గ్రీన్ అంబాసిడర్లకు కలెక్టర్ గారు జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవితో కలిసి కిట్లను పంపిణీ చేసి, శాలువా కప్పి సముచితంగా సత్కరించి వారి సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శానిటేషన్ అండ్ ట్రైనింగ్ శిరీష, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రభ రెడ్డి, తాసిల్దార్ రేణిగుంట సురేష్, గ్రామ సర్పంచ్ ఈశ్వరమ్మ పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ తిరుపతిలో అందరూ భాగస్వాములు కావాలి

డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, మునికృష్ణ



ప్రజాశక్తి – తిరుపతి టౌన్: స్వచ్ఛ తిరుపతిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, మునికృష్ణలు పిలుపునిచ్చారు. తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వడంపై సింగాలగుంట ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణలు మాట్లాడుతూ అందరూ ఇల్లు, కార్యాలయాలు, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే స్వచ్ఛ తిరుపతి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరేంద్ర, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, డి.ఈ.లు రాజు, మధు, మహేష్, రమణ, ప్రసాద్, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ నరేంద్ర, ఫైర్ ఆఫీసర్ శ్రీకాంత్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిచ్చా టూరు: శనివారం వెంగలత్తూరులో జరిగిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎంపిడిఓ మహమ్మద్ రఫి పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతినెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ, వెలుగు అధికారాలు, ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండల పంచాయతీలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలను నెరవేర్చాలని డిఎల్పిఓపి వెంకటరమణ, స్థానిక ఎంపిడిఓ ఏకొల్లు వేణులు అధికారులకు, ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని అల్లంపాడు, కొక్కుపాడు, చెందోడు పంచాయతీల్లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో డి.ఎల్.పి.ఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్ ,కిరణ్, సుమలత ,రియాజుద్దీన్, ఎం ఆర్ సి సృజన ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణంలోని ఇందిరానగర్, జానకి రామ్ పేటలో స్వర్ణాంధ్ర –స్వచ్ఛ స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచు రామయ్య మాట్లాడుతూ ప్రజలు, నాయకులు, అధికారులు సమిష్టి కృషితో స్వచ్ఛ గూడూరు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సుధాకర్ రాజు, వేమసాని మురళి నాయుడు, మునగాల చక్రవర్తి, కోసూరు కృష్ణ, రామచంద్రయ్య, లాలు ప్రసాద్ యాదవ్, జీవన్, యస్వంత్, సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు, రాములు, శ్రీనివాస్ యాదవ్, శానిటరీ సెక్రటరీ పోలయ్య సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు సొసైటీ ప్రాంతంలో నిర్వహించిన స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ శాఖ సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజల చేత ప్రమాణం చేయించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గూడూరు పురపాలక పరిధి, చెన్నూరులో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మట్టం శ్రావణి రెడ్డి స్వయంగా చీపురు పట్టి పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు యరమాపు హేమ కుమార్ రెడ్డి, కటికాల శ్రీనివాసులు, అల్లం కృష్ణయ్య, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాగలాపురం: శనివారం ఉదయం నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగలో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డ్వామా పిడి, బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో త్రివిక్రమరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భానుప్రియ, ఎంపీడీవో సిబ్బంది సచివాలయ సిబ్బంది తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని పుత్తూరు మునిసిపల్ కమీషనర్ మంజునాథ్ గౌడ అన్నారు. శనివారం పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ వెంకట కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్, డాక్టర్ ఎ దేవకి, డాక్టర్ జి తిరుమలయ్య, డాక్టర్ కుమార శ్రీదేవి, డాక్టర్ పి వరలక్ష్మి, తదితర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): శనివారం ఉదయం కళ్యాణి డ్యాం, పోలీసు శిక్షణా కళాశాల పరిసర ప్రాంతాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది, శిక్షణ పొందుతున్న పోలీసులు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సుబ్రమణ్యం , వైస్ ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసులు డీఎస్పీలు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పంచాయతీలో తడి చెత్త – పొడి చెత్తల విభజనపై గ్రామ సర్పంచ్ లలిత కరుణాకర్, ముని రాజా గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. హరిత రాయబారులను సచివాలయ ఆవరణలో సన్మానం నిర్వహించి, సేఫ్టీ కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణప్ప, రవికుమార్, అర్జున్ బాబు, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఓజిలి : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీడీవో విజయలక్ష్మి ప్రజలను పిలుపునిచ్చారు. స్వచ్ఛ్ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఎంపీడీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందించండి : సిపిఎం



ధర్నాలో సిపిఎం మండల కార్యదర్శి రమణయ్య, నాయకులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పిచ్చిగుంట కాలనీలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నారు. వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. శనివారం ఉదయం ఎంపీడీవో త్రివిక్రమరావుకు వినతి పత్రం అందించారు. ఈ కాలనీవారు పందులు మేపుకొని జీవనం సాగిస్తున్నారని, ఆ జీవాలు చనిపోగా ప్రభుత్వం ఎటువంటి సాయం అందించలేదని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందించి వారిని ఆదుకోవాలని వినతిలో కోరారు. గత సంవత్సరం బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు 250 పందులను తీసుకెళ్లి అమ్ముకున్నాడని, ఆ విషయమై అడిగితే మీకు కార్పొరేషన్లు లోన్లు ఇప్పిస్తామని చెప్పారన్నారు. ఇపుడు జీవాలు చాలా వరకు చనిపోతుండటంతో వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, పిచ్చుగుంట కాలనీవాసులు పాల్గొన్నారు.

తానంకి నానాజికి టిడిపి నాయకుల శుభాకాంక్షలు



ప్రజాశక్తి -కోట : పెంచులకోన లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ తానంకి నానాజి జన్మదిన సందర్భంగా శనివారం చిల్లకూరులో ఆయన నివాసంలో కోట మండల టీడీపీ నాయకులు, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్, సీనియర్ టిడిపి నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి ,వెంకన్న పాలెం పంచాయతీ సర్పంచ్ కోకర్ల మధు యాదవ్, కోట ఎంపీటీసీ దారా సురేష్, కోట మండల పార్టీ ఉపాధ్యక్షులు మద్రి అనిల్, తల్లం శ్రీనివాసులు, నందం మోహన్, నాయబ్, నౌషాద ,తదితర మండల నాయకులు కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గోకుల మిత్ర షెడ్‌కు పునాది వేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కోట : పాడి రైతుల జీవితాల్లో మార్పు తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం గోకుల మిత్ర పథకం ద్వారా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు, షేక్ అలీ అహ్మద్‌కు గోకుల మిత్ర పథకం కింద షెడ్ మంజూరు చేశారు. ఈ మేరకు షేక్ జలీల్ అహ్మద్, కోట జామియా మసీద్ ఇమామ్ మౌలానా హిదాయతుల్లాల చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు సీఎంకు, ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

సైబర్ క్రైమ్‌లో ఇరికించాడు : లక్ష్మీ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మహిళలను మోసం చేయడమే తప్ప జనసేన పార్టీ లీడర్ కిరణ్ రాయల్‌కు ఇంకేమీ తెలియదని బాధితురాలు లక్ష్మీరెడ్డి అన్నారు. జైపూర్ నుండి బెయిల్ పై విడుదలైన ఆమె శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో లాయర్ బాలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లాయర్ బాల మాట్లాడుతూ అసలు ఈ సైబర్ క్రైమ్ కేసుకు లక్ష్మీ రెడ్డికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అయినా తన స్వార్థానికి లక్ష్మీ రెడ్డిని కిరణ్ రాయల్ కేసులో ఇరికించాడని, పూర్తి సాక్ష్యాధారాలతో జైపూర్ కోర్టులో లక్ష్మీరెడ్డిపై ఉన్న ఆరోపణలను అక్కడి న్యాయమూర్తికి వివరించామన్నారు. వెంటనే న్యాయమూర్తి లక్ష్మీరెడ్డికి బెయిల్ మంజూరు చేశారన్నారు. లక్ష్మీ రెడ్డి విషయంలో ఎప్పుడో 2021లో నమోదైన కేసుకు సంబంధించి కిరణ్ రాయల్‌పై ఆరోపణలు చేసిన నేపథ్యంలో రెండు రోజుల్లో లక్ష్మీరెడ్డిని జైపూర్ పోలీసులు అరెస్టు చేస్తారని అతను చెప్పడం వెనుక పెద్ద వ్యూహాన్ని రచించాడన్నారు. కిరణ్‌రాయల్ వల్ల తనకు ప్రాణహాని ఉందని, అతనిపై నాన్ బెయిలబుల్ సెక్షన్లతో కొత్త ఎఫ్ఐఆర్ నమోదు కోసం మళ్లీ ఫిర్యాదు చేస్తున్నామన్నారు.

భర్త వేధింపులపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) కట్టుకున్న భర్తే డబ్బు కోసం తనతో చేయరాని పనులు చేయిస్తూ కరోనా సమయం నుంచి దాదాపు 18 లక్షల రూపాయలు సంపాదించుకున్నాడని, ఇపుడు కూడా డబ్బుపై యావతో చామెట్ యాప్‌లో న్యూడ్‌కాల్స్ చేయాలని ఒత్తిడి చేస్తున్నాడని రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన శ్రీదేవి వాపోయింది. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఇకపై ఈ తప్పు చేయలేనని చేయి కోసుకుని భర్త మునిరత్నం రెడ్డితో తెగేసి చెప్పినా ఒప్పుకోవడం లేదని, నాపై భౌతికంగా దాడులు చేశారన్నారు. ఈ విషయమై రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. వేధింపులు భరించలేక విడాకుల నోటీసు పంపానన్నారు. రామచంద్రపురం పోలీస్ స్టేషన్లో పనిచేసే రమణ అనే కానిస్టేబుల్ నా పరిస్థితి చూసి కూడా తన వాట్సాప్ కు అసభ్యకరమైన సందేశాలు పంపి, దానిని నేను చూసిన తర్వాత డిలీట్ చేశాడన్నారు. అన్యాయం జరిగిందని పోలీస్ స్టేషన్ గడప తొక్కితే అక్కడి కానిస్టేబుల్ కూడా తన సమస్యను ఆసరాగా మార్చుకోవడానికి ప్రయత్నించడం బాధ కలిగిస్తోందన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వేడుకున్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం) మహిళా సాధికారతే లక్ష్యంగా చేతన సోషల్ ట్రస్ట్ పనిచేస్తుందని మేనేజింగ్ ట్రస్ట్ సుబ్రమణ్యేశ్వర రావు అన్నారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని కేటి రోడ్డులో గల ఎన్జీవోస్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో చేతన విద్యార్థులతో చేతన సోషల్ ట్రస్ట్ పదవ వార్షికోత్సవం సందర్భంగా ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ గడిచిన 10 సంవత్సరాలుగా మహిళా సాధికారత కోసం ఉచిత టైలరింగ్ క్లాసులను తిరుపతి, జీవకోన, ఐతేపల్లి, రేణిగుంట, మంగళం ప్రాంతాలలో దాదాపు 1200 మంది మహిళలకు జీవనోపాధి, ఆర్థిక స్వావలంబన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రయ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధినేతలు శోభా రాణి, రమేష్, భైరవ అనిమల్ కేర్ ట్రస్ట్ అధినేత సేతురాం మోహన్, నాగలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే



ప్రజాశక్తి - నాయుడుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టిడిపి ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యంల సమక్షంలో నాయుడుపేట, టిడిపి కార్యాలయంలో శనివారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూళ్లరుపేట నియోజకవర్గం, నాయుడుపేట చుట్టుపక్కల మండలాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు ఇచ్చారు. ఎమ్మెల్యే విజయశ్రీ వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాల వద్ద మురుగునీటి కాలువల మరమ్మత్తు చేపట్టాలని కోరుతూ ఎమ్మెల్యేకు సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే చొరవ చూపి పూలే విగ్రహాల వద్ద గల మురుగునీటి కాలువలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు శిరసనం భేటీ.విజయభాస్కర్ రెడ్డి,మైలారి. రాజశేఖర్,మాజీ జెడ్పిటిసి పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ 786 ఎస్.కే.రఫీ, టిడిపి మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి కోటను సందర్శించిన విదేశీయులు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి కోటను మాజీ ఎంపీ, అమరాజా గ్రూప్స్ చైర్మన్ గల్లా జయదేవ్, అతని మిత్రబృందం (విదేశీయులు) శనివారం సందర్శించారు. వారికి జయదేవ్ కోట విశిష్టతను, ప్రాచుర్యాన్ని వివరించారు. భారతదేశం సంస్కృతి, చారిత్రక నేపథ్యం ఉన్న దేశమని వారు అభివర్ణించారు.

కొత్తపట్నంలో సిబిఐసి భూముల తనిఖీ

ప్రజాశక్తి -కోట : కొత్తపట్నం పంచాయతీలో సిబిఐసి భూములను స్థానిక రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్న విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆయా భూములను శనివారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అక్కడ ఉన్న సి బిఐసి భూముల వివరాలను రెవిన్యూ అధికారులు,స్థానిక రైతులతో పలు విషయాలను చర్చించారు.కొత్తపట్నం పంచాయతీలో 824 సర్వేనెంబర్ లో ఉన్న భూముల విషయంపై వాటి యొక్క స్థితిగతులు ఎలా ఉన్నాయి అనే కోణంలో రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో కోట తాహసిల్దార్ కటారి.జెజే రావు,ఆర్ ఐ మధులత,వీఆర్వోలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ గోపిరెడ్డి, స్థానిక రైతులు ఉన్నారు.

క్రైం న్యూస్

పోలీసులమని నమ్మించి నగలతో పరారీ

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: పోలీసులమని నమ్మించి, గుర్తు తెలియని వ్యక్తులు ఓ జంట వద్ద బంగారు నగదు ఎత్తుకెళ్లిపోయిన ఘటన శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలంలో చోటుచేసుకుంది. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర తెలిపిన వివరాల మేరకు రొంపిచెర్ల మండలం, గెర్లపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం శెట్టి భార్య భారతితో కలిసి ద్విచక్ర వాహనంలో చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని స్వగ్రామానికి తిరిగి ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో ఎండపల్లివారిపల్లి వద్దనున్న పెట్రోల్ బంకు వద్ద వాహనాన్ని ఆపిన కొంతమంది తాము పోలీసులమని, బంగారు నగలు వేసుకొని ద్విచక్ర వాహనంలో తిరగడం ప్రమాదకరమని, నగలను తీసి భద్రంగా పెట్టుకోవాలని సూచిస్తూ ఒక పేపరు అందించారు. సుబ్రహ్మణ్యం శెట్టి తన చేతిలోనే ఉంగరం, భార్యా మెడలో బంగారు చైనును ఆ పేపర్‌లో చుట్టి పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో పెట్టుకుంటూ ఉండగా తామే పొట్లం కట్టి ఇస్తామని తీసుకున్నారు. ఆ పొట్లాన్ని పెట్రోల్ ట్యాంక్ కవర్‌లో పెట్టినట్లు నటించి అక్కడ నుంచి వెళ్లిపోయారు. వారు వెళ్లిపోయిన తరువాత ట్యాంకు కవరును పరిశీలించిన సుబ్రహ్మణ్యం శెట్టి తాము మోసపోయినట్లు గ్రహించి భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. 34 గ్రాముల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, దొడ్లవారి మిట్ట వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పనిచేస్తున్న దంపతులు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే దొడ్లవారి మిట్టవద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని తిరుమల దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో మాధవ కృష్ణ, పోకల సరిత సుమంగళి కారులో వెళుతూ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వీరికి 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ నాగరాజ్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాసు పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మినిమం టైం స్కేల్ సాధనకై జిల్లా సదస్సు



కరపత్రాలు పంచుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం విడుదల చేసిన మినిమం టైం స్కేల్ జీ.వో.నెంబర్.2ను సవరించాలని ఉద్యోగుల సంఘ నాయకులు, సీఐటీయు మద్దతుతో కరపత్రాలను విడుదల చేశారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ (సి.ఐ.టి.యు) ఉద్యోగుల సంఘం మినిమం టైం స్కేలు సాధనకై 16వ తిరుపతి, యశోదానగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో జరగనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు గూడూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను వివిధ ప్రధాన కూడళ్ళలో అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు అధ్యక్షులు బి.వి రమణయ్య, కార్యదర్శి యస్.సురేష్, గూడూరు ఆర్టిసి హయ్యర్ బస్సుల గూడూరు పట్టణ అధ్యక్షులు వై.రమణయ్య కమిటీ సభ్యులు కె.శీనయ్య, కార్యదర్శి ఆర్.అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

:కమిషనర్ షేక్ ఫజీలుల్లా



ప్రజాశక్తి -నాయుడుపేట: రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఎస్కే ఫజీలుల్ల ఎన్‌హెచ్ఎఐ హైవే అథారిటీకి లేఖ రాసినట్లు శనివారం తెలియజేశారు. రోజురోజుకి నాయుడుపేటలో పెరిగిపోతున్న ఆక్రమణలతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఇష్టానుసారం స్థలాలను ఆక్రమించుకోవడమే కాకుండా, ఒకరు ఆక్రమించుకున్న స్థలాల్లో మరొకరు కొట్లు కడుతూ గొడవలు పెట్టుకుంటున్నారని విమర్శించారు. రోడ్లపై కొట్లు నిర్మించి వాటిని అద్దెలకిచ్చి సంపాదించుకోవడం వారిక పరిపాటి అయిదని ఆగ్రహం వెలిబుచ్చారు. ఇప్పటికే పలుమార్లు ఆక్రమణదారులను హెచ్చరించామని, అయినా వారిలో ఎటువంటి చలనం లేదని, తదుపరి చర్యల లో భాగంగా సంబంధిత అధికారుల ద్వారానే అక్కడి నిర్మాణాలను తొలగించి, ఖాళీ చేయించడం జరుగుతుందని తెలిపారు.

జనసేనలోకి కొట్టిడి మధు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : వైసీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు కొట్టిడి మదు శనివారం జనసేన పార్టీలో చేరారు.. ఆయనకు ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కోటా వినుత కందువా కప్పి సాదర స్వాగతం పలికారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు సాధనకోసం కషి చేయాలని కోరారు. కష్ట పడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. తోట గణేష్, కావలి శివకుమార్, పేట చంద్రశేఖర్, రాజ్య లక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

4500 కార్మికులను కొండ దించే దమ్ముందా?

ముఖ్యమంత్రి చంద్రబాబుకు చింతామోహన్ సూటి ప్రశ్న

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: 4500 మంది కార్మికులను తిరుమల కొండ దించే దమ్ము ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉందా అని మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో టీటీడీ పరిపాలన భవనం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపై పనిచేసే క్రైస్తవులను కిందకు దించుతామనడాన్ని ఖండించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్నది పొరపాటు చర్య అన్నారు. క్రైస్తవ బిడ్డలను కొండ నుంచి దింపే అధికారం, భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు ధర్మాసనాన్ని కూడా లేదని తెలిపారు. 5000 మంది దళితులు తిరుమలలో టాయిలెట్లు కడుగుతున్నారని తెలిపారు. వీరిలో 90% దళితులేనన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, రావణ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత : జేసీ బన్సల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రహదారి భద్రత నియమాలు పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 36వ జాతీయ రహదారి మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్, మాజీ డిటిసి ఆదినారాయణ, ట్రాఫిక్ డిఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధ్యం

స్టాలిన్‌కు శివరాత్రి ఆహ్వానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆహ్వానం పలికారు. ఎమ్మెల్యే బొజ్జల శనివారం చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, ముక్కంటి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎస్వీజేసిలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాల సాధన దిశగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించాలని ఇచ్చిన పిలుపు మేరకు శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు ఈ వారం థీమ్ ' తడి చెత్త, పొడి చెత్త , హానికర వ్యర్ధాలను, ఆకుపచ్చ నీలం ఎరుపు రంగు చెత్త కుండీలల్లో వేరు చేయు పద్ధతిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ సి. శ్రీనివాసులు నాయుడు, అధ్యాపకులు, డా. సి. ఎల్. చెన్నా రెడ్డి, వై. మహేశ్వరయ్య, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ ప్రధాని నరేంద్ర మోడీని లీగల్లీ కన్వర్టెడ్ బిసి అని ప్రస్తావించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, వెంటనే రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిపై ఉపయోగించిన పదాలను వెనక్కు తీసుకోవాలని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో సాకం ప్రభాకర్, జగన్నాథం, రామచంద్ర, గిరి శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే ఆరణి ఘన స్వాగతం

ప్రజాశక్తి - తిరుపతి : షష్ఠి షణ్ముఖ యాత్రలో జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం తిరుత్తణికి చేరుకోగా ఆయనకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి సుబ్రమణ్యం స్వామి ఆలయానికి చేరుకోగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు. పూజల అనంతరం పవన్ కళ్యాణ్ విజయవాడకి బయలుదేరి వెళ్లారు. ఈ పూజల్లో పవన్ కళ్యాణ్ తనయుడు అకిరా నందన్, టిటిడి బోర్డు మెంబర్ ఆనంద్ సాయి, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తిరుపతి నగర అధ్యక్షులు రాజా రెడ్డి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి నార్త్ సెక్షన్, అలిపిరి సబ్ స్టేషన్ పరిధిలో గల 33/11 కె.వి. మెడికల్ కాలేజీ ఫీడర్, 33/11 ,కె.వి స్విమ్స్ ఫీడర్ 33/11 కె.వి.గిరిపురం ఫీడర్లు, 11 కె.వి. యూజి కేబుల్ హెడ్ లైన్లు విద్యుత్ లైన్లను తొలగించుటకు, నిర్వహణకు ఈరోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం కలుగుతుందని ఏపి.ఎస్పీ. డి.సీయాల్ ఈ.ఈ.విన్నకోటిచంద్ర శేఖర్ రావ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తుడా బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్.కు విశేష స్పందన

తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బిపిఎస్, ఎల్ఆర్ఎస్ మేళాకు విశేష స్పందన లభించిందని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య తెలిపారు. శనివారం సాయంత్రం తుడా కార్యాలయంలో ఈ మేళాకు సంబంధించి అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తుడాలో నిర్వహించిన మేళాలో 2020 వ సంవత్సరం ఎల్.ఆర్.ఎస్.కి సంబంధించి 3363 దరఖాస్తులు పెండింగ్ ఉండగా 2394 దరఖాస్తులు క్లియర్ చేశామన్నారు. 432 షార్ట్ ఫాల్ పెట్టామన్నారు. 2019 వ సంవత్సరం బీపీఎస్ కింద 51 దరఖాస్తులు ఉండగా 10 అనుమతులు ఇచ్చామని, షార్ట్ ఫాల్ పెట్టామన్నారు. షార్ట్ ఫాల్ ఉన్నవి పరిష్కరించేందుకు ఇంటింటి వెళ్ళి ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తాన్నారు. వేచిచూడకుండా తుడా కార్యాలయంలో వచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మార్చి నెలాఖరు లోపు దరఖాస్తులు పరిష్కరించు కోవచ్చని తెలిపారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన మేళాలో సుమారు వందమంది నేరుగా వచ్చి దరఖాస్తులు పరిష్కరించు కొన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సి.పీ.ఓ. దేవికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం/ చంద్రగిరి: గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతతోనే స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ సాధ్యమని ఎంపీడీవో ఇందిరమ్మ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛ దివస్, స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల భాగస్వామ్యంతో నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కే వెంకటరమణ, డిప్యూటీ తహసిల్దార్ ఎం అన్వర్ భాష, వీఆర్వోలు సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. గంగిరెడ్డిపల్లిలో ఈవోపీఆర్డి చంద్రశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రజిని చెత్తతో సంపద తయారీ కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రం చేసి తిరిగి ప్రారంభించారు కుప్పం బాదూరు, ఎన్ ఆర్ కమ్మపల్లి, గ్రామ పంచాయతీలలో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీడి రెడ్డప్ప, ఏపీవో హంస వేణి భూగర్భ జలాల నీటిమట్టం పెరుగుదల కోసం ఇంటి ఆవరణంలో ఇంకిటి గుంతల నిర్మాణాన్ని చేపటారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, పోరా హరి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. **చంద్రగిరిలో..** మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో, శనివారం అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆస్పత్రి ఆవరణంలో పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఎంపీడీవో శేఖర్ ఆధ్వర్యంలో, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ శివ రామ సుబ్బయ్య పర్యవేక్షణలో పరిసరాలను శుభ్రం చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో సీఐ సుబ్బరామిరెడ్డి నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు.



ప్రణాళికాబద్ధంగా పాఠాలను బోధించాలి



ప్రజాశక్తి -కోట : పాఠశాలలోని విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా పాఠాలను బోధించాలని మండల విద్యాశాఖ అధికారి దారా మస్తానయ్య, క్లస్టర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వి. విజయభాస్కర్‌లు అన్నారు. ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని జడ్పీ పి గర్ల్స్ హై స్కూల్‌లో క్లస్టర్ కాంప్లెక్స్‌పై ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. అంతేకాకుండా అజెండా అంశాలను, పరిచయం చేయడం, వివరించడం, టైం టేబుల్, మెటీరియల్, గుర్తించబడిన క్లస్టర్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లను పాల్గొనేవారికి పరిచయం చేయడం లాంటి విషయాలను గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే గాని, మనసుకు కాదు : సిడిపిఓ పి ఆర్ ప్రదీప



ప్రజాశక్తి - రామచంద్రాపురం: వికలత్వమన్నది శరీరానికే గాని, మనసుకు కాదని చంద్రగిరి సిడిపిఓ పిఆర్ ప్రదీప అన్నారు. రామచంద్రాపురం మండలంలోని కమ్మ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ్ బి పడాయి బి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సూపర్వైజర్లు పావనిశ్రీ, వి.రేవతి, బీపీసీ సి.ఆశాలతాదేవి, మనోహర్, రాజేశ్వరి దివ్యాంగుల గురించి వివరించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులతో కలిసిపోయి బోధన సాగించాలన్నారు.

భారతదేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి సాధిస్తుంది



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజనీతి, పరిపాలన శాస్త్రం, పూర్వ విద్యార్థులు సంయుక్తాంగా నిర్వహిస్తున్న "ప్రపంచ శక్తిగా భారత దేశం: వికసిత్ భారత్ వైపు ప్రయాణం 2047" అంతర్జాతీయ సదస్సును ఎస్వీయు ఉపకులపతి ఆచార్య సి.హెచ్. అప్పారావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ డా.అమితాబ్ సింగ్ కీలకోపన్యాసం చేశారు. గౌరవ అతిథులు ఒక్సన్ విశ్వవిద్యాలయం, హైద్రాబాద్ ప్రొఫెసర్ కొనార్డ్ గుణేచ్, సోమాలి ల్యాండ్ ప్రొఫెసర్ మురొంగ బెనర్డ్‌లు భారత దేశం వికసిత్ భారత్ వైపు పాయనిస్తోందని వివరించారు. ప్రత్యేక ఆహ్వానిథులుగా విచ్చేసిన ప్రొఫెసర్ కె. సుధారాణి, ప్రిన్సిపాల్, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, ప్రొఫెసర్ జి. స్టాన్లీ జయ కుమార్ మాట్లాడుతూ భారతదేశం విద్యా లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయడం శుభపరిణామన్నారు. ఈ సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ బి. వి. మురళీధర్ సదస్సు ముఖ్య ఉద్దేశం గురించి వివరిస్తూ, భారతదేశం అన్నిరంగాల్లో ముందుకెళ్తోందని, ప్రపంచ దేశాలతో పోటీ పడుతూ అభివృద్ధి దిశగా పయనిస్తోందని వివరించారు. ఈ సదస్సులో డా. ఐ. ఎస్. కిశోర్, డా. కన్నన్, డా. ఐ. సుబ్రమణ్యం, డా. శ్రీరాములు, డా. వెంకటేసుల రెడ్డి, డా. పి. సుబ్రమణ్యం, డా. మల్లికార్జున మరియు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మంచి పౌష్టికాహారం, విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం తెలిపారు. శనివారం పుత్తూరు బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎంఈఓ 2 బాలసుబ్రమణ్యం, గేట్ పుత్తూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం కేజే వేములు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసి డేస్ సూపర్వైజర్ సంధ్య, గీతాంజలి, అనిత, టాటా ట్రస్ట్ కోఆర్డినేటర్ సంతోషి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు



సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం, ఆర్థికశాఖల ఆధ్వర్యంలో "గ్రామీణ పర్యాటకము, సుస్థిర జీవనోపాదులు" అనే అంశము పైన రెండు రోజుల సదస్సు విశ్వవిద్యాలయంలోని సెమినార్హాలులో బ్లాక్ వన్ లో ముగిసింది. ఈ కార్యక్రమములో డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్మెంట్ ప్రొఫెసర్ వాణి మాట్లాడుతూ మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహించాలని వివరించారు. ఈ కార్యక్రమములో మహిళా అధ్యయన శాఖ ఇన్చార్జ్ హెడ్ డాక్టర్ నీరజ అసిస్టెంట్ ప్రొఫెసర్ పద్మావతి విమెన్ స్టడీస్ సెంటర్ స్టాఫ్ రీసెర్చ్ స్కాలర్స్ స్టూడెంట్స్ అందరూ పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కె. సంతోష రావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని వివిధ కార్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత నివ్వాలని ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం ఉదయం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) వై. లక్ష్మీ నరసయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ డీఎస్ వరకుమార్, జనరల్ మేనేజర్లు సి. ప్రసాద్, ఎం. కృష్ణారెడ్డి, సిహెచ్ రామచంద్ర రావు, డి. సురేంద్ర రావు, యం. మురళి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులోని జనాభా విద్య విభాగం, ఎకనామెట్రిక్స్ విభాగాలు కలిసి నిర్వహించిన 7 రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు వక్తలను సన్మానించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన యూనివర్సిటీ సిడిసి డీన్ ఆచార్య చంద్రాయుడు మాట్లాడుతూ నాణ్యమైన విద్యా బోధనకు పాటించాల్సిన విధివిధానాలను అధ్యాపకులకు వివరించామన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు బోధనా పద్ధతుల మెరుగుకు ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జేఎంవి వినోదిని, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం ప్రొఫెసర్ ఐ .వి .లలిత కుమారి, ప్రొఫెసర్ శ్రీదేవి, ప్రొఫెసర్ ప్రశాంత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ క్లీన్ అండ్ గ్రీనే రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ప్రతి 3వ శనివారం జరిగే వర్సిటీ కార్యక్రమం "క్లీన్ అండ్ గ్రీన్" వర్సిటీ భవనాలలో, విభాగాలలో దిగ్విజయంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉప కులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు పరిపాలన భవనం వద్ద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నరసయ్య, సిడిసి డీన్ ఆచార్య కె సి రాయుడు, లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ, కల్చరల్ కోఆర్డినేటర్ డా. పత్తిపాటి వివేక్, ఆచార్య దామోదరం, డా. సుధేష్ణ, డా. ఢిల్లీ కుమార్ కోటి, డా శరత్ బాబు, డా. ఆదిశేషు, డా. సుదర్శన్ రెడ్డి, కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీయులో వేమన పై సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 17న వర్సిటీ సెనేట్ హాల్‌లో వేమనపై సదస్సు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి, బయోటెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య కె.వి సరిత ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, కేటి రామకృష్ణారెడ్డి లు పాల్గొనగా, ముఖ్య వక్తలుగా విశ్రాంత ఆచార్యులు శివా రెడ్డి, రమేష్‌లు పాల్గొన్ననున్నారు. ఈ కార్యక్రమాన్ని సాహితీ వేత్తలు, తెలుగు భాషాభిమానులు దిగ్విజయం చేయాలన్నారు.

సైన్స్ డ్రామా ఫెస్టివల్, అన్వేషణ్‌ల గోడపత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఛాంబర్ లో "సైన్స్ డ్రామా ఫెస్టివల్", రామయ్య యూనివర్సిటీ వారి "అన్వేషణ" గోడ పత్రికలనూ వర్సిటీ విసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు చేతుల మీదగా ఆవిష్కరించారు. 20, 21తేదీల్లో కర్ణాటకలోని రామయ్య విశ్వవిద్యాలయంలో సాంస్కృతిక అంశాలలో ప్రతిభావంతులను గుర్తించుటకు "అన్వేషణ్" కార్యక్రమ గోడపత్రికనూ, 28న జాతీయ సైన్స్ డే సందర్భంగా "సైన్స్ డ్రామా ఫెస్టివల్" గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిడిసి డీన్ ఎన్ సి రాయుడు, ఆచార్య మురళీధర్, కోఆర్డినేటర్స్ డా. పత్తిపాటి వివేక్, డా పాకనాటి హరికృష్ణ పాల్గొన్నారు.

వైకల్యంతో ఉన్న పిల్లల అవసరాలను గుర్తించాలి

ప్రజాశక్తి -కోట : పలు రకాల వైకల్యంతో కూడిన పిల్లలను పరిశీలించి, గుర్తించాలని అంగనవాడి ఐసిడిఎస్ సిడిపిఓ మునికుమారి తెలిపారు. శనివారం కోట, చిట్టేడు జడ్పీ హైస్కూల్‌లో మొదటి ఫేజ్‌లో భాగంగా మూడో రోజు శిక్షణ కార్యక్రమాలు ముగిశాయన్నారు. అంగవైకల్యంతో ఉన్న వారి అభిరుచిని బట్టి విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. అనంతరం అంగన్వాడి సూపర్వైజర్ కవిత వికలాంగుల విధి, విధానాలును అంగన్వాడీ కార్యకర్తలకు వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిడిపిఓముని కుమారి, సూపర్వైజర్ కవిత అంగన్వాడి కార్యకర్తలు రాజేశ్వరి,రూప,కోమది,తదితర అంగనవాడి కార్యకర్తలు పాల్గొన్నారు.